ప్రజాశక్తి

ఆదివారం 26 నవంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

మిలీనియం టవర్‌లో..

ఐటి సంస్థలకు ఆస్కారం లేనట్టే !

ఒక్కొక్కదాన్నీ శాఖల కోసం ఆక్రమిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని రుషి కొండ హిల్ నెంబర్ 3 మిలీనియం టవర్‌లో స్థానిక ఐటి సంస్థలకు ఆస్కారం లేకుండా పోతోంది. ఐటి కంపెనీలకు తక్కువ అద్దెలకు ఇక్కడి భవనాలు ఇచ్చేందుకు ప్రభుత్వం తొలుత దీని నిర్మాణం చేపట్టింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విశాఖకు కీలక ప్రభుత్వ శాఖలను తరలించి మిలీనియం టవర్ మొత్తాన్ని ఆక్రమించుకుంటోంది. మిలీనియం టవర్ 'ఎ'ను రూ.145 కోట్లతో ఎపి ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ అభివృద్ధి చేసింది. మొత్తంగా ఈ ఫ్లోర్ ఏరియా 170000 చదరపు అడుగులు. 2019 ఫిబ్రవరి 15న ప్రారంభించారు. హిల్ నెంబర్ 3పై ఎ, బి బ్లాక్‌లు ఉన్నాయి. ఈ రెండింటిలో కలిపి సుమారు 4 లక్షల చదరపు అడుగుల స్థలం ఉంది. రాజధాని విశాఖకు వచ్చిన సందర్భంగా తాత్కాలిక సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు ఇక్కడ ఉండనున్నాయి. ఇక్కడి మిలీనియం టవర్ బిను రాష్ట్ర ప్రభుత్వం రూ.19.73 కోట్లతో పూర్తిచేసింది. అంతకు ముందే ఎ బ్లాక్‌ను 10 అంతస్తులుగా తీర్చిదిద్దారు. తాజా నిర్ణయాలతో మిలీనియం టవర్ ఎ, బి బ్లాక్‌లు ప్రభుత్వ ఆధీనంలోకి రానున్నాయి. ఇదే ప్రాంగణంలో కాండ్యుయెంట్ అంతర్జాతీయ ఐటి దిగ్గజ సంస్థ పక్కనే ఉండనుంది. గతంలో ఈ సంస్థకు నోటీసులు ఇచ్చి ఖాళీ చేయాలని కోరినా మొండికేయడంతో తాజాగా ఆ కంపెనీ జోలికి ప్రభుత్వం వెళ్లలేదు. ప్రస్తుతానికి ఖాళీ ప్రాంగణంలోకి మాత్రమే ప్రభుత్వ శాఖల తరలింపు జరుగుతోంది. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల బృందం కూడా రుషికొండ హిల్ నెంబర్ 3పైగల మిలీనియం టవర్ ఎ, బి బ్లాక్‌లను పలు దఫాలుగా పరిశీలించిన పిదపే ఆమోదముద్ర వేసింది.

మిలీనియం టవర్ ఏరియా

అసలు సమస్యేమిటి?

పెద్ద పెద్ద ఐటి దిగ్గజ సంస్థలేవీ విశాఖకు రానందున స్థానికంగా యువతకు ఉపాధి కల్పించడానికి బిపిఒ కంపెనీల కోసం మిలీనియం టవర్ నిర్మించారు. రెంటల్ ఛార్జీలు కూడా మినిమంగా నిర్ణయిస్తే తప్ప చిన్న సంస్థలూ ఇక్కడికి రాని పరిస్థితి ఉంది. వీటికోసం నాలుగు అంతస్తులను ఖాళీగా ఉంచు తున్నారు. ఐతే అసలు సమస్యేమిటిటంటే పక్కనే హిల్ నెంబర్ 1, 2 కొండలపై అంటే ఇన్ఫోసిస్, టెక్‌మౌరి ఐటి సంస్థల వద్ద హెలీప్యాడ్ నిర్మాణం జరిగింది. దీని వల్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖకు వచ్చి పోయేటప్పుడు మొత్తంగా ఐటి ఉద్యోగులకు ఇక్కట్లు తప్పవని వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ హెలీప్యాడ్ నుంచే రుషికొండలోగల మిగతా 2లో..

కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి రవిశంకర్

ఫిషింగ్ హార్బర్ బోట్లు దగ్ధం కేసులో..

ఇద్దరు అరెస్టు

సిగరెట్ కాల్చి పడేయడమే కారణం : సిపి రవిశంకర్

వార్త మెయిన్‌లో..

ఎయు ఇన్‌ఛార్జి విసిగా సమత బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసిగా ఎయు రెక్టార్ ఆచార్య కె.సమత శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అభినందనలు తెలిపారు. వివిధ విభాగాల అధిపతులు, డీన్‌లు, ఆచార్యులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు సమతను ఆమె కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వర్సిటీని ఉన్నత స్థితికి తీసుకురావాలన్నారు.

'ధూమ్ ధామ్'ను జయప్రదం చేయండి

వార్త 4లో..

పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం

వార్త 8లో..

విశాఖలో థియేటర్ ఫెస్ట్ ప్రారంభం

వార్త 2లో..

దీక్షల్లో కూర్చున్న ఉక్కు కార్మికులు

'ఉక్కు' పరిరక్షణతో రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - ఉక్కునగరం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుని ప్రతి ఒక్కరూ రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు వరసాల శ్రీనివాసరావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1017వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ డబ్ల్యుఎండి, అడ్మిన్, యుటిలిటీస్, టౌన్ అడ్మిన్, టిటిఐ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.5 వేల మిగతా 2లో..

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు పావని

ప్రజాశక్తి - అనకాపల్లి : ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్.పావని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సంఘం ఆధ్వర్యాన స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఎన్‌టిఆర్ స్టేడియం వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్ఇపిని రద్దు చేయాలని, అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పెద్ద పెట్టున నినదించారు. అనంతరం స్టేడియంలో సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పావని మాట్లాడుతూ నూతన విద్యా విధానం వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ఫీజుల భారం పడుతుందని, డిగ్రీ సెమిస్టర్ విధానం వల్ల విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతుందని అన్నారు. మహిళలు, విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులు, దాడులు పెరుగుతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరించడం సరికాదన్నారు. మహిళల రక్షణకు చట్టాలు ఉన్నా వాటిని పటిష్టంగా అమలు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారని మండిపడ్డారు. సంఘం పూర్వ జిల్లా నాయకులు శంకరరావు మాట్లాడుతూ మిగతా 2లో..

అనకాపల్లి పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పావని, జిల్లా నాయకులు, విద్యార్థులు

మొదటి పేజీ తరువాయి..

నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలి

పాఠశాలల విలీన పద్ధతిని దేశంలో ఎక్కడా అమలు చేయకుండా మన రాష్ట్రంలోనే అమలు చేయడం దుర్మార్గమన్నారు. ఇది విద్యార్థులను చదువుకు దూరం చేయడమే అవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రమణ, జిల్లా ఉపాధ్యక్షులు గీతాకృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు సిహెచ్.శివాజీ, బాలాజీ, రామేశ్వరరావు, ప్రసాద్, కార్తీక్, కేశవ, వెంకటేష్, బంగారు చిట్టి, అభి, వెంకటి, రమ్య, పూజిత, స్వరూప పాల్గొన్నారు.

ఐటి సంస్థలకు ఆస్కారం లేనట్టే !

ఎపి టూరిజం స్థలాల్లో నిర్మాణమైన సిఎం క్యాంప్ ఆఫీసుకు జగన్ వెళ్లాలి. ఆయన వచ్చినప్పుడు, వెళ్లినప్పుడు గంటల తరబడి ఐటి ఉద్యోగులు సెక్యూరిటీ సమస్యలను ఎదుర్కోనాల్సిందేనా ? అనే ప్రశ్నకు ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం వద్ద సమాధానం లేదు. అంతేగాక పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ శాఖలు కొన్నింటికి అకామిడేషన్ సదుపాయం లేనందున నిర్మాణంలో ఉండే భవంతులను హోల్‌సేల్‌గా రెంటల్స్‌కి తీసుకోవడం కూడా జరుగనుంది.

'ఉక్కు' పరిరక్షణతో రాష్ట్రాభివృద్ధి

కోట్లు పెట్టుబడి పెడితే పన్నుల రూపేణా ప్లాంట్ రూ.25 వేల కోట్లను రాష్ట్రానికి, రూ.50 వేల కోట్లును కేంద్రానికి పన్నుల రూపంలో చెల్లించిందన్నారు. ప్రస్తుతం మూడు లక్షల కోట్లకుపైగా ఆస్తులను కలిగి ఉందని తెలిపారు. నేటి పాలకులు వెయ్యి జన్మలెత్తినా విశాఖ ఉక్కు లాంటి భారీ పరిశ్రమను నిర్మించగలరా ? అని ప్రశ్నించారు. పోరాటాలతో, త్యాగాలతో ఏర్పడ్డ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ కదన రంగంలోకి దిగాలన్నారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు ఎన్.రామచంద్రరావు, కామేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రజలకు మౌలిక వసతుల కల్పనే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. శనివారం పాతనగరం 37వ వార్డు పెయిందొర పేట, హనుమాన్ గుడి నేవల్ క్యాంటీన్ వద్ద రూ.49.98 లక్షల వ్యయంతో సామాజిక భవన నిర్మాణానికి దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, కార్పొరేటర్ చెన్నా జానకిరామ్‌తో కలసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న నగరాలలో విశాఖ ముందంజలో వుందని అన్నారు. వార్డు ప్రజలకు అవసరమయ్యే తాగునీరు, వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్యం, రోడ్లు, కాలువల నిర్మాణం మొదలైన పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జివిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకం వద్ద మేయర్ హరి వెంకట కుమారి

పుస్తక ప్రదర్శనలకు ఉచిత స్థలం ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పుస్తక ప్రదర్శనలకు ప్రభుత్వం ఉచితంగా స్థలాలు ఇవ్వాలని ప్రముఖ రచయిత డివి.సూర్యారావు అన్నారు. విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవాన్ని శనివారం విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ సిహెచ్.రాఘవేంద్రరావు ప్రారంభించారు. అనంతరం ఆచార్య సూర్యారావు మాట్లాడుతూ సమాజంలో రచయితల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. విద్యార్థులలో పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించడం కోసం తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడిని తీసుకొచ్చేందుకు విశాలాంధ్ర ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. ఠాగూర్, ప్రేమ్‌చంద్ తదితర ప్రముఖుల సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు విశాలాంధ్ర ప్రచురణలు పరిచయం చేశాయని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు, ఆచార్య సిమ్మన్న, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, బుక్‌హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపులో జగనే సూత్రధారి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఓట్లను తొలగించడం, దొంగ ఓట్లు నమోదు జరిగేలా చూడటం వంటి చర్యల్లో ప్రధాన సూత్రధారి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డినే అని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ ఆరోపించారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో టిడిపి, జనసేన కూటమి అఖండ విజయం సాధిస్తుందన్నారు. జగన్‌కు ఎన్నికలలో ఓడిపోతాననే భయం పట్టుకుందన్నారు.

పవన్‌ను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ప్రస్తుత శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు విశాఖ నొవొటెల్‌లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు ఈ కార్య క్రమంలో మాజీ మంత్రివర్యులు బండారు సత్యనారాయణమూర్తి, విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయ్ బాబు పాల్గొన్నారు.

నయవంచన

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విశాఖలో మంత్రులు, విభాగాల అధిపతులు, ఉన్నతాధికారులకు క్యాంపు కార్యాలయాలను కేటాయిస్తూ తాజాగా ప్రభుత్వం జారీచేసిన జిఒను చూస్తే 'తాటి చెట్టు ఎందుకు ఎక్కావంటే, దూడ గడ్డి కోసమన్నట్లు' వుంది. రాజధాని విషయం న్యాయస్థానంలో వుండడంతో రాజధానిని తరలిస్తున్నామని చెప్పే సాహసం చేయలేక ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పర్యవేక్షణ, సమీక్ష ముసుగులో ప్రభుత్వ కార్యాలయాలను తరలించి తన పంతం నెగ్గించుకోవాలని ప్రభుత్వం చూస్తున్నట్లు అర్థమవుతుంది. 35 శాఖల్లో 18 శాఖలకు భవనాలు గుర్తించినట్లు ఉత్తర్వులో పేర్కొంది. కానీ ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వల్లమాలిన ప్రేమ ఒలకబోస్తున్న సిఎం జగన్మోహన్‌రెడ్డికి మాత్రం కార్యాలయం కేటాయించలేదు. రుషికొండలో రిసార్టుల పేరిట పర్యాటక శాఖ నిర్మిస్తున్న భవనం నుంచి సిఎం పరిపాలన వుంటుందన్న ప్రచారం వాస్తవరూపందాల్చేందుకు కొన్ని రోజులు పట్టేలా వుంది. అనుకున్నట్లు భవనానికి హంగులన్నీ అయ్యాక సిఎం క్యాంపు కార్యాలయ కేటాయింపు కూడా పూర్తికానుంది. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధివున్నా, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయించివుండేది. దాదాపు నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వానికి అభివృద్ధి పట్టలేదు. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల కేటాయింపుతోనే అభివృద్ధిని పరుగులు తీస్తుందని నమ్మించాలని చూస్తోంది.

కాంగ్రెస్, టిడిపి ప్రభుత్వాల్లో ఉత్తరాంధ్రకు జరిగిన అన్యాయమే ఈ ప్రభుత్వం లోనూ కొనసాగుతోంది. వెన్నుముకలేనట్లు ప్రజాప్రతినిధులు వ్యవహరించబట్టే వెనుకబాటుతనం నుంచి

బయటపడ్డంలేదు. నేటి తరం ఆశలు, ఆకాంక్షలు పాలకపక్షానికి పట్టడంలేదు. విలువలు వదిలి, అబద్ధాలాడి, అభివృద్ధి లక్ష్యాలు మరిచి ప్రధాన రాజకీయ పార్టీలు ప్రవరిస్తున్నాయి. ఆత్మను అమ్ముకొని, ఆత్మాభిమానాన్ని చంపుకొని చేస్తున్న రాజకీయాలు ఎవరి కోసం? స్వీయ ప్రయోజనాలు తప్ప ప్రజల ప్రయోజనాలు ఇందులో ఏమున్నాయి. 32 మంది ప్రాణాలు బలిదానం చేసి సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రంలో బిజెపి నాయకత్వానవున్న మోడీ ప్రభుత్వం నిలువునా అమ్మకానికి పెడుతుంటే వైసిపి, టిడిపి, జనసేన ఏమిచేస్తున్నట్లు ?. ఫ్యాక్టరీ అమ్మకాన్ని అడ్డుకోలేని ఈ ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసమే ఈ కార్యాలయాల తరలింపు అంటే ముమ్మాటికే వంచనే. సహకార చక్కెర ఫ్యాక్టరీలను ఆధునీకరించి పునరుద్ధరించకుండా, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తిచేయకుండా, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధులు కేటాయించకుండా ఈ ప్రాంతం వ్యవసాయంలో ఎలా పురోగతి సాధిస్తుందని ఈ ప్రభుత్వం భావిస్తోంది?. గిరిజన ప్రాంతంలో రహదారుల సౌకర్యం కల్పించకుండా డోలీ మోతలు ఎలా తప్పుతాయి?. వైద్య సౌకర్యం ఎలా అందుబాటులోకి వస్తుంది?. ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణకు సిపిఎం ఉత్తరాంధ్రలో ఇటీవల బైక్ ర్యాలీ చేపట్టి ప్రజలను కదిలించింది. తమ బలం పెరిగిందని చెప్పుకొనే ప్రధాన పార్టీలు బిజెపి ప్రమాదకర విధానాలపై మాట్లాడ్డానికి ఎందుకింత బలహీనంగా వున్నాయి?. ప్రభుత్వం తమ పంతం నెగ్గించుకున్నామన్న ఆనందంలో అభివృద్ధిని విస్మరించి రాజకీయ విన్యాసాలు చేస్తే ప్రజలు సహించరన్న సత్యాన్ని తెలుసుకోవాలి. ప్రజల కోపం కట్టలు తెంచుకొనే రోజులురాకముందే వంచనను వదలి, అభివృద్ధిపై దృష్టి పెట్టాలి.

థియేటర్ ఫెస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిరిపురంలోని విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో తలపెట్టిన లిట్ లాంటర్న్ ఫర్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ, వైజాగ్ జూనియర్ థియేటర్ ఫెస్ట్ రెండో ఎడిషన్ శనివారం లాంఛనంగా ప్రారంభమైంది. అడవిలాంటి థ్రిల్ కలిగేలా ఎరీనాను నిర్వాహకులు తయారు చేశారు. ముంబయికి చెందిన కలెక్టివ్ మ్యాడ్నెస్, కన్జర్వేతరీ ఫర్ ఆర్ట్స్ అండ్ ఆర్టిస్టు వారు రూపొందించిన 'తారాస్ త్రయం' సంగీత నాటకం ప్రదర్శించారు. ఇక రెండో సెషన్‌లో ఆర్‌కె.నారాయణ్ రచించిన మాల్గుడి డేస్ నాటకాన్ని ప్రదర్శించారు. ముంబయి మైమ్ కళాకారులు, మిస్టర్ కునాల్ మోట్లింగ్, సందేశ్ సంజయ్ తమ కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. దేవి సీ ఫుడ్స్ లిమిటెడ్, నెక్కంటి సీ ఫుడ్స్ లిమిటెడ్, సంధ్య మెరైన్స్ లిమిటెడ్, సిఎంఆర్ షాపింగ్ మాల్, శారద మెటల్స్, అల్లాయ్స్, తనిష్క్, వివాని హోటల్ వారు స్పాన్సర్లుగా వ్యవహరించారు.

ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆటో మోటారు కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) ఆధ్వర్యాన నగరంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో శనివారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి జె.రాజారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ కార్మికులపై ఆర్థిక భారాలు పడే విధంగా విధానపరమైన నిర్ణయాలు చేయడం దారుణమన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను మోడీ సర్కారు తీసుకురావడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు, రెహిమాన్ పాల్గొన్నారు.

చెస్‌లో చిచ్చర పిడుగు నిత్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చదరంగం క్రీడలో తమ విద్యార్థి నిత్య పసారి చిచ్చర పిడుగు మాదిరిగా విజయాలు సాధించిందని డివైన్ టచ్ స్కూల్ ప్రిన్సిపాల్ నీహా దాస్ పేర్కొన్నారు. రామ్‌నగర్‌లో గల పాఠశాలలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. నిత్య చిన్న వయసులో క్లిష్ట మైన క్రీడ చదరంగంలో రాణించడం విశేషమన్నారు. కార్యక్రమంలో విశాఖ చెస్ సంఘం అధ్యక్షులు వినుకోట బాలకృష్ణ, బాలిక తండ్రి మన్మోహన్, తల్లి నిధి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల రక్షణ ప్రభుత్వాల బాధ్యత

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యార్థుల రక్షణ బాధ్యత ప్రభుత్వాలదేనంటూ శనివారం ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రామా టాకీస్ కూడలి నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగరాజు, ఎన్.శ్రీను మాట్లాడుతూ విద్యార్థులకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మూడు రోజుల క్రితం భారీ వాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో ఎనిమిది మంది విద్యార్థులు ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. నగర పరిధిలో ఉదయం 7 గంటల నుంచి భారీ వాహనాలకు అనుమతి ఇవ్వకూడదన్నారు.

నేవీ డే ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డిసెంబర్ 4న బీచ్ రోడ్డులో జరిగే నేవీ డే ఏర్పాట్లుపై సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తన కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఆ రోజు నగరానికి వివిఐపిలు వస్తున్నందున భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు

In the Court of the IInd Additional District & Sessions Judge (MACT) Amalapuram, East Godavari Dsitrict

M.V.O.P. No. 48/2023

Between:
Puvvula Chandravathi and Others
(Petitioners 2, 3, 4, 5 are being minors represented by their mother and natural guardian Puvvula Chandravathi P1)
...Petitioners
AND
Malladi Veerababu and Others
...Respondents

Notice to Respondent:
R-2: Gondesi Sandeep, S/o. Veera Venkata, Hindu, age not known, Door No. 19-441, Pineapple Colony, Chinnagadili, Visakhapatnam, Pin: 530028. (Owner of Pulsar Motor Cycle bearing Regd. No. AP 39 BG 3117).

In the above M.V.O.P. No. 48/2023 the 2nd Respondent hearing date stand posted to **15-12-2023 at 10.30 AM** before the 2nd Additional District and Sessions Judge, Amalapuram, E.G.Dt., Hence take notice that if you fail to appear before the said court on that day, the matter will be decided ex party in your absence.

Hearing Date: 15-12-2023

N.RAJASEKHAR, Advocate
Amalapuram
Amalapuram
Dt: 23-11-2023
Cell: 9849193665

విద్యార్థులను తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి -మధురవాడ : విద్యార్థులను వారి మనస్తత్వాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని ఐఎండిపి జిల్లా మేనేజర్ కాకర నరేష్ సూచించారు. పాఠశాలల్లో జరుగుతున్న ఐఎండిపి ప్రోగ్రామ్‌ను ఆయన పరిశీలించారు. ఎస్ఇఆర్‌టి, సమగ్ర శిక్ష ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎంట్రప్రెన్యూరల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం-ఫేజ్ 4లో భాగంగా 9వ తరగతి విద్యార్థులకు వారి సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు సృజనాత్మక, నైపుణ్యం, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ, చినగదిలి మండలంలో ఉన్న అన్ని గవర్నమెంట్ పాఠశాలలకు ఐఎండిపి సర్వే బృందం పర్యవేక్షణకు వస్తారని తెలిపారు. ఎండాడ జెడ్‌పి హైస్కూల్‌లో ప్రోగ్రాం ఫెసిలిటేటర్ కెవి.సత్యనారాయణ విద్యార్థులకు 14వ సెషన్‌లో భాగంగా సమస్యను గుర్తించడం అంశంపై బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.పరిపూర్ణ మాట్లాడుతూ, ప్రతి వారమూ ఐఎండిపి తరగతులు పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కప్పల ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ నెట్‌బాల్ జట్టుకు తనుశ్రీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : విజయవాడలోని మేరిస్ స్టెల్లా కళాశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈ నెల 19 నుంచి 21 వరకు 14 ఏళ్ల విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో పాల్గొన్న స్థానిక సన్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని కె.తనుశ్రీ జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల కరెస్పాండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో విద్యార్థినిని శనివారం అభినందించారు. రూ.10 వేల చెక్కును బహుమతిగా అందజేశారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్‌ను కూడా ఆయన అభినందించారు.

26 నుంచి పోలమాంబ ఉత్సవాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఎగువపేట గ్రామ దేవత పోలమాంబ ఉత్సవాలు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామాభివృద్ధి సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, 26వ తేదీన కలశాలతో ఊరేగింపు జరుగుతుందని పేర్కొన్నారు. 29వ తేదీ వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో గ్రామాభివృద్ధి సేవా సంఘం ప్రతినిధులు గంటా నూకరాజు, మైలపల్లి షణ్ముఖరావు, అల్లిపిల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు, మాజీ కౌన్సిలర్ మైలపల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌తో 'కోరాడ' భేటీ

ప్రజాశక్తి-ఆనందపురం : విశాఖకు విచ్చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను టిడిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నోవాటెల్ హోటల్‌లో ఆయనను కలుసుకొని తాజా రాజకీయ పరిస్థితులపై కాసేపు చర్చించారు.

సముద్రంపై హక్కు మత్స్యకారులదే

ప్రజాశక్తి -భీమునిపట్నం : సముద్రంపై మత్స్యకారులదే పూర్తి హక్కు అని రాష్ట్ర మత్స్యకారుల ఫోరం అధ్యక్షులు కదిరి జగన్నాథం స్పష్టం చేశారు. భీమిలిలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీచ్ శాండ్ తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లయితే మత్స్యకారులందరూ ఐక్యంగా వ్యతిరేకిస్తారన్నారు. బీచ్ మైనింగ్ దేశ అంతర్గత భద్రతకు ముప్పు అని తెలిసినా ప్రభుత్వం ముందుకు వెళ్తే మత్స్యకారుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

గ్రీన్ బెల్ట్ ప్రాంతాలను సంరక్షించాలి : కమిషనర్

గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఆర్‌టిఎస్ మార్గంలో ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రదేశాలను శుభ్రపరిచి, సంరక్షించాలని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా హనుమంతవాక నుంచి అడివివరం వైపు వెళ్లే బిఆర్‌టిఎస్ రోడ్డులో ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలోని జాతీయరహదారి, బిఆర్‌టిఎస్ రోడ్డులో ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రదేశాలను నిత్యం పరిశుభ్రపరచాలని, గ్రీన్ బెల్ట్ ప్రదేశాలలో ఉన్న తోపుడు బండ్లు, బడ్డీలతో ఆక్రమణలకు గురికాకుండా సంరక్షించాలన్నారు. ఈ పర్యటనలో పట్టణ ప్రణాళికాధికారి సురేష్ కుమార్, జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీరు శ్యాంసన్‌రాజు, ఎసిపి శాస్త్రి, రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ప్రతిపాదనను విరమించాలి

ప్రజాశక్తి -మధురవాడ : పిఎసిఎస్ సభ్యులు ఏకగ్రీవంగా వ్యతిరేకించినా పెట్రోల్, డీజిల్ బంక్ పెట్టాలన్న సహకార శాఖ అధికారుల ప్రతిపాదనను తక్షణమే విరమించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించిందని పిఎసిఎస్ పూర్వ ఉపాధ్యక్షులు ఎం.పైడిరాజు తెలిపారు. సంఘం ఆవరణలో సభ్యులు సియ్యాద్రి పైడితల్లి, పోతిన ఎల్లమనాయుడుతో కలిసి శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పైడిరాజు మాట్లాడారు. మధురవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి (పిఎసిఎస్) సర్వే నెం 159/5 బిపిలో ఉన్న 0.48 సెంట్ల సొంత స్థలంలో ఉన్న భవన సముదాయాన్ని కూల్చివేసి పెట్రోల్, డీజిల్ బంక్ పెడతామని సెప్టెంబరు 21న సభ్యులకు తెలియకుండా అధికారులు కొలతలు కొలిచారని తెలిపారు. దీనిపై వెంటనే స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి సంఘం సభ్యులు, అఖిలపక్ష నాయకులు తీసుకెళ్లారని వివరించారు. ఎమ్మెల్యే స్పందించి డిప్యూటీ రిజిస్ట్రార్‌తో మాట్లాడి తనకు తెలియకుండా ఇటువంటి అనాలోచిత నిర్ణయాలు చెయ్యవద్దని చెప్పారని తెలిపారు. అయినా అధికారులు బంక్ కోసం డిపాజిట్ కట్టారని వివరించారు. దీంతో తప్పనిసరి అయి సంఘం సభ్యులైన నలుగురుము కలిసి హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు సంఘం సభ్యుల ఇష్టం లేకుండా ఇటువంటి ప్రయత్నాలు చెయ్యడం సహకారం శాఖ నిబంధనలకు వ్యతిరేకమని హైకోర్టు న్యాయమూర్తి వి.సుజాత తీర్పునిచ్చారని తెలిపారు. సంఘం ఆస్తిని కాపాడడానికి తమతో పాటు వెన్నంటి ఉండి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు, వైసిపి, టిడిపి, జనసేన, సిపిఐ, సిపిఎం తదితర అఖిలపక్ష పార్టీల నాయకులకు, సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

గీతంలో అధునాతన సిటి స్కాన్ ఏర్పాటు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) వైద్య కళాశాల ఆసుపత్రిలో రోగుల వైద్య పరీక్షలకు అధునాతన సిటీ స్కాన్ పరికరాన్ని (సోమటామ్ గో) శనివారం గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం ప్రారంభించారు. జిమ్సర్ ఆసుపత్రిలోని రేడియేషన్ విభాగంలో ఏర్పాటైన ఈ పరికరం సిటి స్కాన్ వైద్య పరీక్షల సమయంలో రోగులపై రేడియేషన్ ప్రభావాన్ని తగ్గించడంతో పాటు రోగ నిర్ధారణలో ఖచ్చితమైన సమాచారం నమోదు చేయగలదని విభాగాధిపతి, ప్రముఖ రేడియాలజీ నిపుణులు డాక్టర్ దుర్గా ప్రసాద్ తెలిపారు. రేడియేషన్ పరీక్షలలో వేగంతో పాటు వైద్యులకు ఖచ్చితమైన వివరాలను అందించగలగటం ఈ సిటీ స్కాన్ ప్రత్యేకత అన్నారు. వైద్య రంగంలో ఈ సిటీ స్కాన్ సరికొత్త ఆవిష్కరణగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ పరికరం హృద్రోగ పరీక్షలలో, రోగ నిర్ధారణ, వైద్యులు తదుపరి నిర్ణయాలు తీసుకోవడంలో ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని చెప్పారు. జిమ్సర్ ఆసుపత్రి ద్వారా నగర ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందించడానికి ఈ సరికొత్త సిటీ స్కాన్ దోహద పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, సూపరింటెండెంట్ డాక్టర్ వివిఎల్.నరసింహారావు, జిమ్సర్ ఆపరేషన్ హెడ్ డాక్టర్ బి.కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీరాధాకృష్ణ మహోత్సవాలు

ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న కమిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సాగర తీరాన గోకుల్ పార్కు వద్ద ఉన్న శ్రీరాధాకృష్ణుల ఆలయం వద్ద ఏటా మాదిరిగానే ఆదివారం శ్రీ రాధాకృష్ణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కమిటీ ప్రతినిధులు స్థానిక గోకుల్ పార్కు వద్ద విడుదల చేశారు. అనంతరం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, 26వ తేదీ ఉదయం 10 గంటలకు కలశ ప్రతిష్ట జరగనుందని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు యలమంచిలి సూర్యనారాయణ, అక్కరమాని వెంకటరావు, అక్కరమాని రామునాయుడు, పిన్నింటి వెంకట రమణ, బమ్మిడి సూర్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, బొట్టా రామకృష్ణ, లొడగల రమణ, జి.ఎల్లయ్య పాల్గొన్నారు.

లింగ వివక్షతకు వ్యతిరేకంగా తీర్మానం

ప్రజాశక్తి -పద్మనాభం : లింగ వివక్షతకు వ్యతిరేకంగా మండల సమైక్య సమావేశంలో శనివారం తీర్మానం చేశారు. మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న మహిళా కార్యాలయంలో జాతీయ లింగ వివక్షత వ్యతిరేక కార్యక్రమాన్ని శనివారం ఎపిఎం ప్రభాకర్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కార్యాలయ సూపరింటెండెంట్ పి.రాధ మాట్లాడుతూ, లింగ వివక్షతకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. అనంతరం బాల్య వివాహం, విద్యా హక్కు, గృహహింస చట్టాలపై మహిళా పోలీస్ కృష్ణవేణి అవగాహన కల్పించారు. ఎపిఎం ప్రభాకర్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం డిసెంబర్ 22వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మొదటివారం జెండర్ ఆధారిత హింసపై, రెండో వారం బాల్య వివాహాలపై, మూడో వారం రక్తహీనతపై, నాలుగో వారం ఆడపిల్లలకు విద్య అంశంపై గ్రామ సంఘాల్లో సమావేశం ఏర్పాటుచేసి మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విఓఎలు లక్ష్మి, లీల తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడిని పరామర్శించిన పవన్ కల్యాణ్

ప్రజాశక్తి -మధురవాడ : పద్మనాభం మండలం రేవిడి పంచాయతీలో ప్రభుత్వ భూమి కబ్జాపై ప్రశ్నించినందుకు వైసిపి నేతల కత్తుల దాడిలో గాయపడి, కోలుకున్న మాజీ సైనికుడు మోపాడు ఆదినారాయణను జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ శనివారం పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాజీ సైనికులకు, వారి హక్కులకు జనసేన అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల, చంద్రరావు, కృష్ణయ్య, శ్రీను బాబు, రవి పాల్గొన్నారు.

మురుగు నీరు దాటుకొని గుడికి వెళ్తున్న భక్తులు

వెంకన్న భక్తులు మురుగునీరు దాటాల్సిందే

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న అనుబంధంగా కొండదిగువన ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు మురుగు నీటిని దాటుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎంతో సుచి శుభ్రంగా ఆలయానికి వెళ్లామని బయలుదేరిన భక్తులకు ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ఉన్న మురుగుదొడ్ల నుంచి మురుగునీరు ఈ రహదారిలో ప్రవహిస్తోంది. భక్తులు ఆ మురుగునీరు మట్టుకొని ఆలయానికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ మురుగునీరు బాధ ఎప్పుడు తప్పుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కొండ దిగువన వరాహ పుష్కరిణిలో గంగా హారతి కోసం స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఇక్కడి నుంచే తీసుకొని వెళ్తారు. ఆ సమయంలోనైనా ఈ మురుగు నీటి ప్రవాహానికి అడ్డకట్ట వేస్తే బాగుంటుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

శివాలయం వద్ద దీపోత్సవం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం శివాలయం సమీపంలో బ్రహ్మకుమారిల ఆధ్వర్యాన ఈశ్వర దీపోత్సవ కార్యక్రమం ఈ నెల 26, 27 తేదీలలో నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారి సంధ్య పుష్ప తెలిపారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని ఆదివారం, సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయొద్దు

శ్రీ బాసర విద్యాసంస్థల చైర్మన్ రమేష్

ప్రజాశక్తి -తగరపువలస : తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయొద్దని శ్రీ బాసర విద్యా సంస్థల చైర్మన్ పూడి రమేష్ విద్యార్థులకు సూచించారు. స్థానిక శ్రీబాసర డిగ్రీ కళాశాలలో శనివారం ఫేర్ వెల్ డే నిర్వహించారు. ముందుగా చైర్మన్ రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలన్నారు. ఉన్నత చదువుల ద్వారా ఉన్నతమైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సురేష్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు

డబ్ల్యుకెఐ ఇంటర్నేషనల్ కరాటేలో ప్రతిభ

ప్రజాశక్తి- ఆనందపురం: 19వ డబ్ల్యుకెఐ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ఆనందపురం వింగ్ షాటో ఖాన్ కరాటే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారని కోచ్ టి.సాయికుమార్ తెలిపారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో ఐదేళ్ల విభాగంలో టి.సాత్విక్, ఆరేళ్ల విభాగంలో కుప్ప రేవంత్, తొమ్మిదేళ్ల విభాగంలో కోరాడ చక్రి బంగారు పతకాలు, 12 ఏళ్ల విభాగంలో జి.దీక్షిత్ సిల్వర్ పతకం సాధించారని వివరించారు. కోచ్ సాయికుమార్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు కోరాడ శ్రీనివాసరావు, కుప్ప రాజశేఖర్, రామలక్ష్మి, ముడసల శ్రీనివాసరావు అభినందించారు.

'వైసిపివి ఓటు బ్యాంకు రాజకీయాలు'

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. పౌర గ్రంథాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు దగ్ధమై మత్స్యకారులు తీవ్రంగా నష్ట పోయినప్పటికీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాకపోవడం అన్యాయం అన్నారు. మత్స్య కారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతోనే రావడానికి ముఖం చెల్లలేదని విమర్శించారు.

'ధూమ్ ధామ్'ను జయప్రదం చేయండి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన నిర్వహించే ధూమ్ ధామ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు 'ధూమ్ ధామ్' కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యం కలిగించడం కోసం ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. విశాఖ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ వీధి నాటికలు, పాటలు రూపాల్లో ప్రజా చైతన్యం కలిగించి ప్రజా ఉద్యమంగా మలచాలనేది ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజా సంపదను తన తాబేదారులకు కట్టబెట్టటమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని విమర్శించారు. ప్రజా సంపదను కాపాడుకోవడం కోసం ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు.

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు కర్మాగారంపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తుందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా చైతన్యం కలిగించడంలో ప్రజానాట్యమండలి ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటిదాస్, యు.రామస్వామి, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కె.సత్యనారాయణ, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు డివి.రమణారెడ్డి, డి.శ్రీనివాస్, దాలినాయుడు, కరణం సత్యారావు, నమ్మి సింహాద్రి, జె.రామకృష్ణ, గుమ్మడి నరేంద్ర, వివిధ విభాగాల స్టీల్ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు, స్టీల్ ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

షాపుల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎఎంహెచ్ఒ కృష్ణంరాజు

అపరిశుభ్రతపై జరిమానా

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 93వ వార్డు పరిధి కృష్ణానగర్‌లో సీలింగ్ సామాన్లు అమ్మే దుకాణం వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో యజమానికి జోన్-8 ఎఎంహెచ్ఒ ఎం.కృష్ణంరాజు రూ.2 వేలు జరిమానా విధించారు. జివిఎంసి 93వ వార్డు పరిధిలోని వివిధ దుకాణాలను శనివారం ఆయన తనిఖీచేశారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. అందుకు సహకరించకుంటే జరిమానా తప్పదని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమణ, శానిటేషన్ కార్యదర్శి చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవించాలి

ప్రజాశక్తి -ములగాడ : రాజ్యాంగం గురించి చిన్న వయసు నుంచే తెలుసుకోవాలని, అందరూ దానిని గౌరవించాలని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం, రాజనీతి శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యాన శనివారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సదస్సులో ఆమె మాట్లాడుతూ, ప్రజల హక్కులు, ప్రభుత్వ అధికారాల సమన్వయమే రాజ్యాంగం అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఎటువంటి సంబంధం ఉండాలో ఇది చెబుతుందని తెలిపారు. ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాలు, ప్రాథమిక విధుల గురించి ఆమె వివరించారు. సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి భారత న్యాయవ్యవస్థ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గురించి వివరించారు. జాతీయ సేవా పథకం యూనిట్-3 ప్రోగ్రాం అధికారి వి.అంజలీదేవి ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగ ప్రవేశిక గురించి వివరించారు. అనంతరం విద్యార్థినులు అందరూ ప్రవేశికను పఠించారు. రాజ్యాంగ ఆదర్శాలను అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఇందులో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు అంజలీదేవి బహుమతులను అందజేశారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఫౌండేషన్ ప్రతినిధులు

జెఎస్‌పి ఫౌండేషన్ ఉదారత

ప్రజాశక్తి -మాధవధార : జెఎస్‌పి ఫౌండేషన్ ఆధ్వర్యాన మురళీ మాధవ విద్యాలయంలో పేద విద్యార్థిని చైత్ర జన్మదినాన్ని శనివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందజేశారు. స్కూల్లో పేద విద్యార్థులను గుర్తించి నెల ఫీజును యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా మురళీ మాధవ కరస్పాండెంట్ సనపల మురళీధర్ మాట్లాడుతూ, జెఎస్‌పి ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెఎస్‌పి నిర్వాహకులు ఎ.మౌనిక, సిఎండిఎ రుద్రసాయి, పీపుల్స్ ఫోరం స్టేట్ ఉపాధ్యక్షులు హెచ్‌డి.నజీమా బేగం, స్కూల్ ప్రిన్సిపల్ సనపల సత్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై నివేదిక అందించాలి

ప్రజాశక్తి -సీతమ్మధార : తిమ్మాపురంలోని కార్పొరేట్ కాలేజీ వసతి గృహంలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థి సాయిచరణ్ ఆత్మహత్యపై పోలీసులు తక్షణమే నివేదిక అందించాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థి ఒత్తిడితో మరణించాడా, అనారోగ్య కారణాలు ఏమైనా ఉన్నాయా, కళాశాల యాజమాన్యం చదువుపై ఒత్తిడికి గురిచేసిందా, ఉపాధ్యాయుల వేధింపులు ఉన్నాయా, ఇతర కారణాలు ఏమైనా ఉత్పన్నమయ్యాయా తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని నివేదిక అందించాలని పేర్కొన్నారు. నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వానికి చట్ట ప్రకారం పలు సిఫారసులు చేస్తామని సీతారాం తెలిపారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా జితేందర్‌రెడ్డికి ప్రమోషన్

జితేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఐటియు, ఐఎన్‌టియుసి నాయకులు

ప్రజాశక్తి -గాజువాక : భెల్ హెచ్‌పివిపి యూనిట్ జిఎంగా పనిచేస్తున్న ఎస్.జితేందర్‌రెడ్డి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ప్రమోషన్ పొందారు. ఈ మేరకు సిఐటియు, ఐఎన్‌టియుసి నాయకులు సంయుక్తంగా శనివారం ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఆయన్ని కలిసిన వారిలో యూనియన్ల నాయకులు వి.బాబూరావు, జిటిపి ప్రకాష్, వి.ఆనందరావు, కె.విజయ్‌కుమార్, ఎస్.జగన్నాధరావు, సీతన్ననాయుడు, సిహెచ్.నారాయణ, మురళీశ్వరరావు, పి.శివరాం, ఎస్.వెంకట్రావు ఉన్నారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి షణ్ముఖరావు

9న మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి -గాజువాక : డిసెంబర్ 9వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని 13వ అదనపు జిల్లా జడ్జి షణ్ముఖరావు కోరారు. గాజువాక కోర్ట్ కాంప్లెక్స్‌లోని 13వ అదనపు జిల్లా న్యాయస్థానంలో శనివారం పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ మెగా లోక్ అదాలత్‌ను పోలీస్ అధికారులు విజయవంతం చేయాలన్నారు. ప్రతి కక్షిదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా పోలీసులు పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్జిలు ఇ.రాజేంద్రబాబు, వై.శ్రీలక్ష్మి, వై.ప్రేమలత, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి.స్వామి, న్యాయవాదులు పాల్గొన్నారు.

1, 2 తేదీల్లో జాబ్ మేళా

ప్రజాశక్తి- కరాస : పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని నిరుద్యోగులకు డిసెంబర్ 1, 2 తేదీల్లో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, ఎపిఎంఎస్ఎంఇడిసి చైర్మన్ ఆడారి ఆనందకుమార్ మెగా జాబ్ మేళాను ఏర్పాటుచేస్తున్నారు. మీతో ఆనంద్ యాప్‌ను ఫోన్లో డౌన్లోడ్ చేసుకుని ఈ జాబ్ మేళాకు రిజిస్ట్రేషన్ అవ్వాల్సి ఉంటుందని ఆయన తెలియజేశారు. ఎంవిపి జూనియర్ కాలేజీ (ఆండాలమ్మ కాలేజీ), అల్వార్ పాలిటెక్నిక్, జింక్ హనుమాన్ టెంపుల్, గాజువాక బస్ డిపో ప్రాంతంలో జాబ్ మేళా ఉంటుందని పేర్కొన్నారు. ఆటోమొబైల్, రిటైల్, టెక్స్‌టైల్స్, హెల్త్ కేర్, ఫార్మా, ఇన్సూరెన్స్, ఐటి, బిపిఒ, ఎడ్యుకేషన్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ తదితర రంగాలకు చెందిన 50 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. మేళాకు వచ్చిన నిరుద్యోగ యువతీ యువకులకు మధ్యాహ్న భోజన సదుపాయం ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 90008 18467, 90009 38467ను సంప్రదించాలని సూచించారు.

పింఛనుదారులకు పాన్‌కార్డు తప్పనిసరి

ప్రజాశక్తి -తగరపువలస : పిఎఫ్ నిబంధనల ప్రకారం జ్యూట్ మిల్లు కార్మికులు పింఛను పొందేందుకు పాన్ కార్డు తప్పని సరి అని సిజెఎంఎండబ్ల్యు అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి రవ్వ నరసింగరావు, దామోదర బాబాజీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సందేహాలు ఉంటే తమను యూనియన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కెవిలో గ్రాండ్ పేరెంట్స్ డే

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 44వార్డు పరిధి తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయంలో 'గ్రాండ్ పేరెంట్స్ డే' వేడుకలు నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ముఖ్య అతిథిగా హాజరై స్కూల్లో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ, విద్యార్థుల్లోని సృజనాత్మకను వెలికితీసేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్స్ దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, స్కూల్ ప్రిన్సిపల్ కమల్‌జీత్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు వివిఎం.శైలజ, నాయకులు హబీబ్, గంగా మహేష్, రాజ్ కుమారి, మహాదాస్యం గోపి, సీతారాములు, బషీర్, ప్రసాద్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రదర్శనలను తిలకిస్తున్న కెకె.రాజు

'పేడాడ' సంతాప సభ

నివాళులర్పిస్తున్న గ్రామ ప్రజలు

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార కోదండ రామాలయం భజన కళాకారుల సేవా సంఘం ఉపాధ్యక్షులు కీర్తిశేషులు పేడాడ మధుసూదనరావు సంతాప సభను శనివారం మాధవధారలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మాజీ కార్పొరేటర్ పూజారి మధుసూదనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కళాకారులు కీర్తిశేషులు పేడాడ మధుసూదనరావు లేని లోటు మాధవధార ప్రజలకు, కళాకారులకు తీరనిది అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మాధవ యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్‌గోపాలరావు, 50వ వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్, 51వ వార్డు టిడిపి నాయకులు సనపల కీర్తి, మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నంబాల ఈశ్వరరావు, భగవతి శ్యామల, భజన కళాకారుల సంఘం అధ్యక్షులు కనుమటి రమణమూర్తి, కార్యదర్శి అన్నెపు కొండలరావు, సభ్యులు ఎండ నిరంజన్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

కిడ్స్ ఫ్యాషన్ షో

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం విజెఆర్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ ఆధ్వర్యాన విశాఖ కిడ్స్ ఫ్యాషన్, టెలెంట్ షో ఆడిషన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు పాటలకు నృత్యాలు ప్రదర్శించారు. రంజీవ్ అధిరాజ్ కొత్తపల్లి స్మారకార్థం ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజెఆర్ సంస్థ అధినేత, క్వీన్ ఆఫ్ ఇండియా విన్నర్ జ్యోతి కొత్తపల్లి మాట్లాడుతూ, 14 ఏళ్ల లోపు పిల్లలకు ఆడిషన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్ విధానంలో ఆడిషన్స్ ఈ నెల 28 వరకు జరుగుతాయని చెప్పారు. కిడ్స్‌లోని ప్రతిభను వెలికి తీయడం కోసం ఈ ఈవెంట్‌ను తలపెట్టామన్నారు. 2 నుంచి 14 ఏళ్ల లోపు 120 మంది చిన్నారులు పాల్గొన్నారని తెలిపారు. వచ్చే జనవరిలో ఫైనల్స్ జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో క్వీన్ ఈవెంట్స్ ఆర్గనైజేషన్ అధినేత ఉషారాణి, బ్రైడ్స్ ఆఫ్ ఇండియా రన్నర్ దివ్య మచ్చా, డ్రీమ్ లైఫ్ స్టూడియో సిఇఒ, దర్శకుడు, నిర్మాత వినయ్ చౌదరి పాల్గొని షోలో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు.

కార్మిక, కర్షక మహా ధర్నాకు తరలిరావాలి

ప్రచార కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి - పరవాడ

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్త కార్మిక, రైతు సంఘాల పిలుపుమేరకు ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే మహాధర్నాకు వందలాదిగా కదిలిరావాలని సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు లంకెలపాలెంలో మహిళలు, కార్మికులతో కలిసి మహాధర్నా పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరలు నియంత్రించాలని, ఆహారం, మందులు, వ్యవసాయ ఉపకరణాలపై జిఎస్టి రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై ఎక్సైజ్ పనులు తగ్గించాలని, ఆహార భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, మండల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.రమణి, నాయకులు టి.సంతోష్, ఎం.సంతోష్ కుమార్, కొండలరావు, స్వాతి, కనకమ్మ పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : విజయవాడ మహా ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని గవర్ల అనకాపల్లి, తోటాడ గ్రామాల్లో సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు రామలక్ష్మి, ఆశ యూనియన్ నాయకులు ఉమా పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, మహిళలు

కె.కోటపాడు : వ్యవసాయ కార్మికులు, రైతుల సమస్యలపై ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో జరుగు మహాధర్నాకు రావాలని కోరుతూ మండలంలోని కెజె.పురం, గవరపాలెం గ్రామాలలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, యర్రా దేముడు ప్రచారం చేశారు.

అచ్యుతాపురం : మండలంలోని సెజ్ పరిసరాలలో కార్మికులతో సిఐటియు నాయకులు సమావేశాలు నిర్వమించి, మహాధర్నాపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.సత్తిబాబు, ఎల్.నరసింహారావు, గణేష్, నానాజీ, రాము పాల్గొన్నారు.

అనకాపల్లి : విజయవాడలో జరుగు మహాధర్నా వాల్ పోస్టర్‌ను శనివారం స్థానిక సర్వకామదాంబ పార్కు దరి నీళ్ల ట్యాంకు సెంటర్లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, పెయింటర్స్ యూనియన్ (సిఐటీయూ) కార్యదర్శి గోపి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే కార్మిక, కర్షక మహాధర్నాకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరంకుశంగా కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను, చివరకు 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అమ్మకానికి పెట్టిందని మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో మోడీ సర్కారును గద్దె దించేందుకు కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్తంగా ఈ మహాధర్నాకు పిలుపునిచ్చాయన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని అక్కిరెడ్డిపాలెం తారకరామాకాలనీ జడ్పీ హైస్కూల్‌లో పిఎసిఎస్ డైరెక్టర్ నారపిన్ని ప్రసాద్ సొంత నిధులు రూ.15000 వేలుతో 10వ తరగతి చదువుతున్న 32 మంది విద్యార్థులకు సమకూర్చిన స్టడీ మెటీరియల్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు చేతుల మీదుగా శనివారం అందజేశారు. ముందుగా ఎంపీపీ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యావంతుడైన ప్రసాదు ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు ఏర్పాటు చేసిన విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలో అనేక నమూనాల ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ అమిటి ధనలక్ష్మి, అంజిలిన రాజశేఖర్, పంతం శ్రీనివాస రావు, అక్కిరెడ్డి శ్రీను, బోండా అప్పారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : క్రీడాకారులు తమ అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటి మొదటిస్థానంలో నిలవాలని ఉమ్మడి విశాఖ జిల్లా ఖోఖో అసోషియేషన్ అధ్యక్షులు దాడి జయవీర్ ఆకాక్షించారు. 32వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ ఖోఖో పోటీలు ఈ నెల 26, 27, 28 తేదీలలో గుంటూరు జిల్లా నర్సారావుపేటలో జరగనున్న నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా జట్ల తుది ఎంపిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. 15 రోజులపాటు నిర్వహించిన శిక్షణ అనంతరం రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొనే తుది జట్టును దాడి జయవీర్, కార్యదర్శి సీహెచ్‌ఎల్‌ఎం శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ సందర్భంగా దాడి జయవీర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి గెలుపే లక్ష్యంగా, జాతీయ పోటీలకు కూడా ఎంపికయ్యే విధంగా క్రీడాకారులంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాడి శ్యామ్‌ప్రసాద్, కర్రి సూర్యనారాయణ, పీలా వీరునాయుడు, లక్ష్మి, జయబాబు, శివ, చిరంజీవి, సబ్-జూనియర్ ఖోఖో జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనువైన రకాల ఎంపిక, సరైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా లాభదాయకమైన రబీ పంటలను పొందవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికె జగన్నాథరావు అన్నారు. ఆర్‌ఏఆర్‌ఎస్‌లో శనివారం జరిగిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్లో వివిధ పంటల్లో దిగుబడులు గణనీయంగా తగ్గవచ్చన్నారు. రబీ సీజన్లో పెసర మినుము, చోడి జనుము నువ్వులు, వేరుశనగ పంటల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ ఉద్యానవన జిల్లా అధికారులు మోహన్ రావు, ప్రభాకర్‌రావు, ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు ముకుందరావు విశాలాక్షి, రామలక్ష్మి, ఎంబీజిఎస్ కుమారి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సమస్యలు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రజాన్యాయ పీఠం (లోక్ అదాలత్) ద్వారా కోర్టులోనూ, బయటా ఉన్న కేసులకు సత్వర పరిష్కార మార్గం చూపుతామని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ (చోడవరం) చైర్‌పర్సన్ ఎస్.అరుణశ్రీ అన్నారు. మండలంలోని కె.సంతపాలెం శివారు కవికొండల అగ్రహారం గ్రామంలో శనివారం మండల న్యాయశాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ అర్హులైన వారికి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ద్వారా ఉచిత న్యాయసలహాలు, సహాయం అందచేస్తామని తెలిపారు. ఈ సదస్సులో కె.కోటపాడు సిఐ ఎస్.తాతారావు, ఉపతహశీల్దార్ డి.రమేష్ బాబు, ఎ.కోడూరు ఎస్ఐ బి.రామకృష్ణ, ఎఎస్ఐలు ఆర్.రాముడు, వి.అప్పారావు, విఆర్ఓ పావాడశివకృష్ణ, పౌరులు చల్లా సింహాద్రినాయుడు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్న కొండ వద్దకు కార్తీక మాస వన సమారాధనలకు వచ్చే వేలాది మందికి తగిన రక్షణ, భద్రత, మౌళిక వసతులు కల్పించాలని కోరుతూ సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీవో చిన్నికృష్ణకు శనివారం వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం, వినకోట నీలేశ్‌గుప్తా, పట్నాల కృష్ణమోహన్, నేలపూడి బాలరాజు, బుగిడి నూకప్పారావు, బి.సోమరాజు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతి హోమం చేసిన ఎంవిఆర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) పట్టణంలోని నర్సింగరావుపేటలో ఉన్న తన గృహంలో శనివారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు వంకాయల శ్రీనివాసరావు, స్థానిక శ్రీ షిరిడి సాయినాధుని ఆలయ అర్చకులు శ్రీనివాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిపించారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలను ముత్యాల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు అందించారు.

టిడిపి నేత పొలిమేరకు మాతృవియోగం

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణ బాలకృష్ణ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పొలిమేర నాయుడు తల్లి మహాలక్ష్మమ్మ శుక్రవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. శనివారం ఆమె మృతదేహాన్ని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, కొణతాల వెంకటరావు, కాండ్రేగుల సత్యనారాయణ, దాడి అప్పారావు, చదరం శివ, బుద్ధ ఈశ్వరరావు, కర్రి మల్లేశ్వరరావు, కోరుకొండ అప్పారావు, మల్ల గణేష్, సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండల కేంద్రానికి సమీపంలో ఉన్న విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని నల్లబల్లి గ్రామానికి చెందిన టెడ్డి లక్ష్మి ఇల్లు ఇటీవల విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలి పోగా, ఆ కుటుంబానికి దేవరాపల్లికి చెందిన రామాంజనేయ యూత్, గాంధీ వీధి 11వ వార్డు సభ్యులు, 40 కేజీల బియ్యం, పది జతల బట్టలు, రూ.2600 నగదును శనివారం అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విభాగం, కృషి విజ్ఞాన కేంద్రాలు సమన్వయంతో పనిచేసి రైతులకు లాభసాటి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్టు మేనేజర్ సిహెచ్.లచ్చన్న తెలిపారు. తుమ్మపాల శ్రీవెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో డిపిఎం లచ్చన్న ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం, బిసిటీ కేవీకే సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి గత నాలుగున్నరేళ్లగా నిరంకుశ పాలన చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను, వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్లో శనివారం బిజెపి జిల్లా నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. ప్రజలు నమ్మకంతో 151 ఎమ్మెల్యే స్థానాలను ఇస్తే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని విమర్శించారు. సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని, గ్రోయిన్లను మరమ్మతులు చేయలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బొడ్డేడ నాగేశ్వరరావు, గారపాటి సీతా రామాంజనేయులు, కాశి విశ్వనాథరాజు ఇతర నాయకులు పాల్గొన్నారు.

పొలిటికల్ టూరిస్టుల మాటలు పట్టించుకోం : అమర్‌నాథ్

కశింకోట : పొలిటికల్ టూరిస్టుల మాదిరిగా వచ్చి వెళ్లే బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి వారి మాటలు పట్టించుకోనక్కర్లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. శనివారం ఆయన కసింకోటలో మీడియాతో ఆయన మాట్లాడుతూ కేంద్రం భిక్షం ఇవ్వటం లేదని, రాష్ట్రానికి పన్నుల రూపంలో రావలసిన మొత్తాన్ని చెల్లిస్తోందని అమర్నాథ్ స్పష్టం చేశారు. పురందేశ్వరి బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలిగా కాకుండా, తెలుగుదేశం పార్టీ నాయకురాలిగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

క్షేత్రస్థాయిలో సమస్యలను తెలపండి : జెసి

ప్రజాశక్తి- అనకాపల్లి : పౌరసరఫరాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తేవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి విజిలెన్స్ సంఘ సభ్యులను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ (ఆహార సలహా) సంఘ సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో పౌరసరఫరాలు, గ్యాస్ పెట్రోలు, రేషన్ కార్డులు, సినిమా హాళ్ళు మొదలైన వాటిలో వినియోగదారులుకు ఎదురయ్యే సమస్యల గురించి వీలైతే వాటి పరిష్కార మార్గాల గురించి సమావేశంలో తెలియజేయాలని సూచించారు. సభ్యుల అభిప్రాయాలను బట్టి తదుపరి కార్యాచరణ చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డీఎస్ఓ కెవిఎల్ఎన్ మూర్తి, పౌరసరఫరాల డిఎంపి. జయంతి, లీగల్ మెట్రోలజీ అసిస్టెంట్ కంట్రోలర్ బి. రామచంద్రయ్య, డీఈవో వెంకట లక్ష్మమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి కే.అనంతలక్ష్మి, సభ్యులు జడ్పిటిసిలు కాకర దేవి, ఎస్వీ గిరిబాబు, జర్నలిస్టులు జి.కాంతారావు, సిహెచ్‌బిఎల్.స్వామి, పిఎస్‌టి పట్నాయక్, బి.సన్యాసిరావు, శ్రీధరాల సోమరాజు, జెట్టి శ్రీను, ఆర్.సత్యనారాయణ, ఆర్. రాంబాబు, జి.సన్యాసిరావు, బుద్ధ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

9 నాటికి ఓటు నమోదు, పరిశీలన పూర్తి

ప్రజాశక్తి-అనకాపల్లి : కొత్త ఓట్లు నమోదు, ఓటర్ పరిశీలన డిసెంబర్ 9న నాటికి పూర్తి చేయాలని అనకాపల్లి ఆర్‌డిఎ చిన్ని కృష్ణ ఆదేశించారు. కొత్తూరు శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఎన్నికల అధికారి, బూత్ లెవెల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు నమోదు ప్రక్రియ చేపట్టాలని, ప్రత్యేక ఓటర్ పరిశీలన సక్రమ పద్ధతిలో నిర్వహిస్తూ చనిపోయిన ఓట్లను, డబుల్ ఎంట్రీలు వున్న ఓట్లను తొలగించాలని ఆదేశించారు. జీరో డోర్ నెంబర్లు కల ఓట్లను గుర్తించి వారికి డోర్ నెంబర్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి డిప్యూటీ తహశీల్దార్ ఎలమంచిలి శ్రీరామ్మూర్తి, కసింకోట డిప్యూటీ తహశీల్దార్ సురేష్ నాయుడు, ఆర్ఐ రమేష్, 251 మంది బూత్ లెవెల్ అధికారులు, 25 మంది సూపర్ వైజర్లు, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా తోట వెంకటేష్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా మండలంలో మడుతూరు గ్రామానికి చెందిన తోట వెంకటేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వెంకటేష్ ప్రస్తుతం గ్రామ సచివాలయ కన్వీనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తనను డైరెక్టర్‌గా నియమించునందుకు ఎమ్మెల్యే కన్నబాబు రాజుకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. వెంకటేష్ నియామకం పట్ల గ్రామ సర్పంచ్ మోటూరు సంజీవ్, ఎంపీటీసీ సభ్యుడు శనివాడ జువ్వాలనాయుడు, వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు దేశం శెట్టి శంకర్రావు, పార్టీ సీనియర్ నాయకుడు కోన బుజ్జి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు అభినందనలు తెలిపారు.

అణగారిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం

మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి, చిత్రంలో మంత్రులు, బూడి, గుడివాడ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-సబ్బవరం

ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ తదితర అణగారిన వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పెందుర్తి నియోజకవర్గ సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ శనివారం సాయంత్రం సబ్బవరంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతారాం మాట్లాడుతూ ముఖ్య మంత్రి పేదలకు ఆంగ్ల విద్యా బోధన అందించడమే కాకుండా విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్, స్కూల్ బ్యాగ్, షూస్ అందిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికే ప్రజలు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం బూడి ముత్యాల నాయుడు, ఎంపీ బివి.సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు అన్నం రెడ్డి అదీప్ రాజ్, గొల్ల బాబురావు, ఎంపిటీసీ, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపగుంట : వైసిపి చేపట్టిన సామాజిక సాధికారిక బస్సు యాత్రను పెందుర్తి నియోజకవర్గంలోని వేపగుంట ప్రాంతంలో శనివారం ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి ఎంపి బివి.సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెందుర్తిలో ఉన్న పాలిటెక్నికల్ కళాశాలలో అదనపు భవనాన్ని మంత్రులు ప్రారంభించారు.

కల్యాణ మండపానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట నూకంబికా ఆలయం వద్ద కోటి రూపాయలతో కళ్యాణ మండపం నిర్మాణానికి రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాలు నాయుడు, గుడివాడ అమరనాథ్ శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లిబాబు, జెడ్పిటిసి శ్రీధర్ రాజు, వైసిపి మండల అధ్యక్షులు మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, సర్పంచ్ మంత్రి జయరజనీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోమినాయుడు, నాయకులు పాల్గొన్నారు.

రాజేశ్వరి కుటుంబానికి మంత్రి పరామర్శ

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని మోసయ్యపేట సర్పంచ్ మిస్క రాజేశ్వరి కుటుంబాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ శనివారం పరామర్శించారు. రాజేశ్వరి కుమారుడు గణేష్ శుక్రవారం మరణించారు. మంత్రి అమర్నాథ్ శనివారం మోసయ్యపేట వెళ్లి గణేష్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆ తర్వాత అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రేమ సమాజానికి నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి- కశింకోట : మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవంలో భాగంగా శనివారం మండలంలోని కొక్కిరాపల్లి ప్రేమసమాజానికి నెల రోజులకు సరిపడే నిత్యవసర వస్తువులను రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సిద్దిరెడ్డి సూర్యనారాయణ, నైనంశెట్టి రమణరావు, ఉల్లింగల రమేష్, కర్రి దుర్గునాయుడు., సిదిరెడ్డి సూర్యనారాయణ, కోన రమణ, శేనాపతి కృష్ణ, కడియాల ప్రసాద్, నక్క సాయి పాల్గొన్నారు.

పోలీసులతో జిల్లా న్యాయమూర్తి సమావేశం

ప్రజాశక్తి-చోడవరం : డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించేందుకు శనివారం స్థానిక కోర్టు హాల్లో 9వ అడిషనల్ జిల్లా జడ్జి కె.రత్న కుమార్ చోడవరం కోర్టు పరిధిలో ఉన్న మండలాల పోలీసులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్ కేసులు పరిష్కారం కోసం తీసుకోవలసిన బాధ్యతలను ఆయన సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో చోడవరం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నాదెండ్లకు నియోజకవర్గ సమస్యలపై వినతి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం నియోజకవర్గ సమస్యలను జనసేన పార్టీ పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు చోడవరం జనసేన పార్టీ ఇంచార్జి పివిఎస్ఎన్ రాజు తెలియజేశారు. రైతుల సమస్యలు, రోడ్ల అధ్వాన్న స్థితిపై ప్రజా పక్షాన జనసేన చేస్తున్న పోరాటాలపై వివరించారు. అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చెయ్యడానికి అవసరమయ్యే కార్యాచరణ రూపొందించి ప్రజలకు తెలియచేసి వారి మద్దతు పొందాలని ఆయన సూచించినట్లు రాజు తెలిపారు.

దుమ్మురేపిన శ్రీహరి కోలాట బృందం

ప్రజాశక్తి-పరవాడ : తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియంలో ఎన్టీవీ వారి ఆధ్వర్యంలో కార్తీక మాసం పురస్కరించుకొని నిర్వహించిన కోటి దీపోత్సవం కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పరవాడ మండలం మంత్రిపాలెం గ్రామానికి చెందిన శ్రీహరి కోలాటం బృందం ఆర్గనైజర్ పచ్చికోరు వెంకట వరలక్ష్మి నేతృత్వంలో కోలాట ప్రదర్శన దుమ్మురేపింది. కోలాట బృందానికి అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా ఆర్గనైజర్ పచ్చికొర వెంకట వరలక్ష్మి మాట్లాడుతూ తమ కోలాట బృందం ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 107వ ప్రదర్శనలు చేసినట్లు చెప్పారు.

రూ.59 లక్షలతో శాంతి పార్కు అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక శారదానది ఒడ్డున ఉన్న శాంతి పార్కును 59 లక్షల రూపాయలతో అభివృద్ధి చేసి, సుందరీకరణ చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ మందపాటి సునీత పేర్కొన్నారు. పార్క్ ఆవరణలో శనివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణశాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజుతో కలిసి బోరు శంకుస్థాపన భూమి పూజను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవీఎంసీ నుంచి పార్కు అభివృద్ధికి రూ.49 లక్షలు, ఎంపీ లాండ్స్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి పబ్లిక్ హెల్త్ విభాగం ఎస్ఈ పి.గణపతి రావు, ఈఈ టి రాయల్ బాబు, డిఈ బి.మహేష్, ఏఈ మణికంఠ, వైసిపి జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నాయకులు కోన ఉమా, పేలూరు కళ్యాణ్, డొంక సత్తిబాబు, మేడిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-మునగపాక రూరల్

స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ప్రశ్నల పరంపరలతో వాడీవేడిగా జరిగింది. ముందుగా మండల వ్యవసాయ అధికారిని జోత్స్నాకుమారి తన నివేదికను ప్రవేశ పెట్టగా, అడ్డు తగిలిన వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు జగనన్న ఇళ్లతో పాటుగా పలు అభివృద్ధి పనులకు నేటికీ బిల్లులు చెల్లించకపోవటానికి గల కారణాలు అధికారులు తెలియజేయాలని డిమాండ్ చేశారు. చూచుకొండ సర్పంచ్ దొడ్డి వెంకట సూర్యఅప్పారావు మాట్లాడుతూ మెలిపాక గ్రామ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం కావడంతో వ్యవసాయ బోర్లు పనిచేయడం లేదని, సాగునీరు లేక పొలాలు పూర్తిగా ఎండిపోయాయని తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీడీవో మన్మధరావు, డిప్యూటీ తహసిల్దార్ వినయ్ కుమార్, ఏవో ప్రసాద్ కుమార్, ఈవోపీఆర్ డి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

శిథిలమైన షెడ్డును పునర్నిర్మించాలని వినతి

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శిథిలావస్థలో ఉన్న షెల్టర్‌ను పునర్నిర్మించాలని సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్ బ్రహ్మాజీలు శనివారం మండల పరిషత్తు సమావేశంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. తహశీల్దారు, ఎంపిడిఒ, పోలీస్ స్టేషన్, వెలుగు, రైతు భరోసా తదితర ప్రభుత్వ కార్యాలయాలకు పలు గ్రామాల నుండి వచ్చే ప్రజలు ఈ షెడ్డులో కొంత సేపు విశ్రాంతి తీసుకొనేవారని, హుదూద్ తుఫాన్‌కు ఈ షెల్టర్ పూర్తిగా శిథిలమైందని, దీనిని పునర్నిర్మాణం చేపట్టాలని కోరారు.

లింగ వివక్ష విడనాడాలి : డిఆర్‌డిఎ పీడీ

ప్రజాశక్తి-అనకాపల్లి

లింగ వివక్ష విడనాడాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎమ్మెస్ శోభారాణి పిలుపునిచ్చారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా శనివారం పట్టణంలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. లింగ వివక్షతపై నాలుగు వారాలపాటు కార్యచరణ రూపొందించడం జరిగిందన్నారు. మొదటివారం లింగ వివక్షత పై ఉన్న చట్టాల గురించి అవగాహన, రెండవ వారం బాల్య వివాహాల నియంత్రణ, మూడవ వారం రక్తహీనత కారణాలు, నివారణ చర్యలు జాగ్రత్తలు, నాలుగో వారం బాలిక విద్యపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు పథక సంచాలకులు డైజీ, అనకాపల్లి జిల్లా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కశింకోట : మండల సమాఖ్య ఆధ్వర్యాన శనివారం లింగ వివక్షపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి మాట్లాడుతూ ఆడ, మగ తేడా లేకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి జయరజని, ఏపిఎం ఎస్. శ్రీనివాసరావు, సీసీ సత్యనారాయణ, గుటలా పార్వతి, విఓఏలు ప్రసన్న, రాము, పద్మ, వరలక్ష్మి, భారతి, పూర్ణ, పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ

మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలో శనివారం బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ స్త్రీకి 18, పురుషులకు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేయాలని, లేకుంటే చట్ట ఉల్లంఘన కింద అరెస్టు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ కానిస్టేబుల్ పరమేశ్వరి. సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం జెండర్ క్యాంపింగ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల అరికట్టాలని, స్త్రీ పురుషులను సమానంగా చూడాలని నినాదాలతో ప్రతిజ్ఞ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సభ్యులు అమరపిన్ని వరలక్ష్మి, చలపరెడ్డి సత్యవతి, ఏపీఎం బాలరాజు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వాలి : ఐద్వా

ప్రజాశక్తి- కశింకోట : తెల్లరేషన్ కార్డుదారులకు రేషన్ సరుకులు ప్రతి నెలా సక్రమంగా ఇవ్వాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నాయకులు డిడి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. కసింకోటలో శనివారం మహిళలతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ గతంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలకు ప్రతినెలా రెండు సార్లు ఉచితంగా బియ్యం ఇవ్వగా, ఆరు నెలల నుండి ఒక సారి మాత్రమే ఇస్తుందని తెలిపారు. గతంలో కందిపప్పు ఇచ్చేవారని, నేడు ఇవ్వడం లేదన్నారు. మార్కెట్లో కందిపప్పు ధర రూ.170 నుండి రూ.200 వరకు ఉందని, దానిని కొనుకోలేక పేదలు కందిపప్పు తినడం తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న పేదలకు ఉచితంగా ఒక మనిషికి 10 కేజీలు చొప్పున నాణ్యమైన బియ్యం, కందిపప్పు, గోధుమపిండి, బెల్లం, వంటనూనె, చోడి పిండి, జొన్నపిండి అందించాలని డిమాండ్ చేశారు. గతంలో రేషన్ డిపోల ద్వారా రోజంతా ఏ సమయంలో వెళ్ళిన రేషన్ డీలర్ సరుకులు ఇచ్చేవారని, నేడు రేషన్ వాహనాలు వస్తున్న సమయంలో ప్రజలు కూలి పనులు మానుకొని ఉండాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లక్ష్మి, సన్యాసమ్మ, సాయిరాం, లోవలక్ష్మి, నాగమణి, రత్నం, పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యాన శనివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్, సీనియర్ అధ్యాపకులు సత్యవతి, డి.మాల్యాద్రి, ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ రత్నభారతి రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రవేశికను విద్యార్థులు, అధ్యాపక చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సిహెచ్.జ్యోతి, సూర్యవతి, రామలక్ష్మి, సరస్వతి, వెంకటేష్, నారాయణ మూర్తి, ఎ.కృష్ణారావు, లక్ష్మీ మంగమ్మ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో గొంప కాంతమ్మకు చెందిన తాటాకు ఇల్లు అగ్నికి ఆహుతైంది. బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... గొంప కాంతమ్మ గ్రామంలో గవరపేట వెళ్లే మార్గంలో పాత హాస్టల్ పక్కన తాటాకు ఇంటిలో నివాసముంటుంది. ఆమె తమ కుమార్తెను చూడడానికి అడ్డూరు గ్రామం శుక్రవారం వెళ్ళగా, ఆ రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఇంట్లో ఉన్న రెండు ఫ్యాన్లు. గ్రైండర్, మిక్సీ, టీవీ, రెండు తులాల బంగారం, రెండు లక్షల రూపాయల నగదు, భూమి పట్టాదారు పాసుపుస్తకం, ఇతర గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. చోడవరం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జడ్పిటిసి ఈర్ల అనురాధ, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ ఇంటిని పరిశీలించి బాధితురాలు కాంతమ్మను ఓదార్చారు. బాధితురాలకు జడ్పిటిసి అనురాధ రూ.3000 ఎంపీటీసీ రాజేష్ రూ.2000 వేలు, తనకల పట్టాలు రూ.2000 అందజేశారు.

తాగునీటి బోరు ఆక్రమణపై నిరసన

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలో రాజాం గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి గతంలో ప్రభుత్వం వేసిన తాగునీటి బోరును గ్రామానికి చెందిన కంఠంరెడ్డి రాజు, కన్నయ్యదొర ఆక్రమించుకోవడంపై స్థానికులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బీసీ కాలనీకి సమీపంలో మంచినీటి అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన ఈ బోరును ఆనుకొని భూమి ఉన్న రైతులు బోరును తొలిగించి చుట్టూ ఫెన్సింగ్ వేశారని, ప్రజల దాహార్తిని తీర్చే బోరును ఆక్రమించుకోవడం దారుణమని కాలనీ వాసులు మండి పడ్డారు. మహిళ మండలి సభ్యులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. బోరు బావి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం పిల్లి దేవీ, పిల్లి అక్కమ్మ, లావేటి లక్ష్మి, చొప్పా అమ్మాజీ, పిల్లి సింహాచలం, షేక్ బీబ్ జాన్, చొప్పా రమణమ్మ, పొనగంటి వేణు, భవాని తదితరులు పాల్గొన్నారు.

శంకరంలో సంకల్ప యాత్ర

ప్రజాశక్తి- అనకాపల్లి : వికాసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమం శనివారం మండలంలోని శంకరం గ్రామంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపిపి గొర్లి సూరిబాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. వ్యవసాయ డ్రోన్ జెండా ఊపి ప్రారంభించారు. గ్రామంలోని పారిశుధ్య కార్మికులను సాలువతో సత్కరించి వారు చేస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ ఎ.హేమంత్, శంకరం గ్రామ సర్పంచ్ పసుపులేటి లక్ష్మీ రామకృష్ణ, డిఎల్‌డివో మంజుల వాణి, ఎంపీడీవో నరసింహారావు, ఈఓపిఆర్డి ధర్మారావు, పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి

-జెవివి ఆధ్వర్యాన సైన్స్ మ్యాజిక్ షో

మ్యాజిక్ చేసి చూపుతున్న జెవివి ప్రతినిధి

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌లో భాగంగా శనివారం నర్సీపట్నం బాలికోన్నత పాఠశాల, మాకవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోను శాస్త్రీయ దృక్పథంపై ప్రచారం నిర్వహించారు. మాకవర పాలెం మండల విద్యాశాఖాధికారి పి.ఎస్.ఎన్ మూర్తి, బాలికోన్నత పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు మాధవి, మాకవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. అచ్యుతరామయ్య మాట్లాడారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. మూఢనమ్మకాలను, అశాస్త్రీయ భావాలను వ్యతిరేకించాలన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని పెంచుకోవాలని సూచించారు.

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ, జనవిజ్ఞాన వేదిక రాష్ట్రవ్యాప్తంగా సైంటిఫిక్ టెంపర్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. జనవిజ్ఞాన వేదిక సీనియర్ మెజీషియన్ శ్రీరాములు సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సర్పంచ్ సూర్యకుమారి

డ్రెయినేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రావికమతం:మండలంలోని కవగుంట గ్రామంలో డ్రెయినేజీ పనులను సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో డ్రైనేజీ సమస్యపై శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాలతో 3 లక్షల జడ్పీ నిధులు, మండల పరిషత్ నిధులు 3 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, ఎంపీపీ పైలరాజు, జడ్పిటిసి తలారి రమణమ్మలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ డైరెక్టర్ వెచ్చం చిన్న నాగరాజు, గ్రామ పెద్దలు రొబ్బాచిన కళ్యాణం దొర, రొబ్బా శ్రీనివాసరావు, పచ్చికూర రాము, దేవుళు సమాల కళ్యాణం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని సిహెచ్ నాగాపురం పంచాయతీలో శనివారం వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు, వైసిపి మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైసిపితో అన్ని వర్గాలకు మేలు

ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి దుర్గానగర్‌లో వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యాన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవివి సత్యనారాయణ హాజరై పార్టీ జెండాను ఎగురవేశారు. సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపితో రాష్ట్రంలో అన్ని తరగతులకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మొల్లి అప్పారావు, సత్తి మందారెడ్డి, పిఐ.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ కుల ధ్రువపత్రాల జారీపై వాస్తవాలు నిగ్గుతేల్చాలి

ప్రజాశక్తి- చింతపల్లి:మండలంలోని నకిలీ కుల ధృవపత్రాల పై తసిల్దార్ స్పందించి నిగ్గు తేల్చాలని ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. చింతపల్లిలో శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలో నకిలీ గిరిజన కుల ధ్రువపత్రాలు పొందిన వారిని విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవడమే కాకుండా వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎస్‌టి కోటాలో వారు పొందిన ప్రోత్సాహకాలు, సంక్షేమ పథకాలు తిరిగి రికవరీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీ వ్యాప్తంగా గిరిజనేతరులు ఎస్టి తెగల పేరుతో నకిలీ కుల ధ్రువపత్రాలు పొంది గిరిజనులకు వస్తున్న సంక్షేమ పథకాలు అక్రమంగా పొందుతున్నారని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా కలెక్టర్ తగు ఆదేశాలు జారీ చేసి నకిలీ కుల దృవపత్రాలు ఇవ్వకుండా చేయాలన్నారు. రెండు నెలల క్రితం ప్రస్తుత చింతపల్లి తహసిల్దార్‌కు ఒక ఎస్సి కులానికి సంబంధించిన వ్యక్తి నకిలీ కుల ధ్రువపత్రాలతో సంక్షేమ పథకాలు పొందుతున్నారని, వీటిపై విచారణ జరిపి తక్షణమే తొలగించాలని కోరినా నేటికీ చర్యలు తీసుకున్న దాఖలు కనబడలేదన్నారు.

మహాసభకు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:అనకాపల్లిలో జరిగే ఎస్ఎఫ్ఐ మహాసభలకు నర్సీపట్నం నుండి ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు తరలివెళ్లారు. చదువుతూ పోరాడు..చదువు కొరకు పోరాడూ అంటూ నినాదాలు చేసుకుంటూ విద్యార్థులు అనకాపల్లి వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి జి.గీతాకృష్ణ మాట్లాడుతూ, జాబ్ క్యాలెండర్, స్కాలర్‌షిప్ వంటి వాటిని అమలు చేయాలన్నారు. ఈ మహాసభలు సుమారు రెండు రోజులు పాటు జరుగుతాయన్నారు. ఈ మహాసభల్లో ఎస్ఎఫ్ఐ నూతన కమిటీలు, విద్యార్థుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కమిటీ సభ్యులు ప్రసాద్, గౌతమ్, జ్ఞానేష్, రాజేష్, కిరణ్, శివ, భూషణ్, అర్జున్, వెంకటేష్, శివ, ఉపేంద్ర, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సభలకు వెళుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

చౌడవాడలో అధ్వానంగా పారిశుధ్యం

నిలిచిన నీరు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో చౌడువాడ గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో గ్రామస్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారులపై మురుగు నీరు ప్రవహిస్తూ ఉండటం, నిల్వ ఉండటంతో ప్రయాణికులు

అవస్థలు పడుతున్న గ్రామస్తులు

సహా ఆయా ప్రాంతవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారిని అనుకుని కాలువలు నిర్మించాలని రోడ్డు విస్తరణ చేపట్టాలని స్థానిక సర్పంచ్ గోపాలకృష్ణ మండల సర్వసభ్య సమావేశం, స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావుకు పలు సందర్భాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కూడా ఆయన దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో గ్రామంలో దోమల బెడదతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దుర్గంధం కూడా వెదజల్లుతోంది. ప్రధాన రహదారిపై నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రయాణికులు సైతం రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలో మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ప్రచారం చేపడుతున్న నేతలు

టిడిపి పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి-రావికమతం:వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే పలు రకాల పథకాలతో ప్రజలను లక్షాధికారులను చేసే బాధ్యత చంద్రబాబు తీసుకోవడం జరుగుతుందని తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన కసిరెడ్డిపాతలెం, ఎల్లన్నపురం, బూరుగు పాలెం, పొర్లపాలెం గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లికి వందనం. ఆడబిడ్డ నిధి, దీపం పథకం, ప్రతి ఇంటికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి ఇంటికి మంచినీరు, నిరుద్యోగ భృతి ఇస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ శ్రీను, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాఫీకి గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-పెదబయలు:స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడల్ మాట్లాడుతూ, పాడేరు డివిజన్ పరిధిలో సుమారు లక్ష ఎకరాలకు 70 వేల మంది రైతులు కాఫీ, మిరియాల సాగుపై ఆధార పడి జీవిస్తున్నారని తెలిపారు. ఐటిడిఎ పరిధిలో కాఫీ పండించే రైతులకు గిట్టుబాటు ధరలేక తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కాఫీ, మిరియాలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసారు. కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయిలు తక్షణమే చెల్లించి, రైతులకు పల్పర్ యంత్రాలు, నిచ్చెనలు, కట్టర్లు ఉచితంగా పంపిణి చేయాలన్నారు. రైతులకు రుణాలు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.గంగాధరం, కె.శరబన్న, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి -దుంబ్రిగుడ: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని సర్పంచి అర్జున్ అన్నారు. కొర్రా గ్రామంలో ఎస్సై సంతోష్ కుమార్ చేతుల గ్రామ యువతకు వాలీబాల్ కిట్లను శనివారం అందజేశారు. గిరియువత క్రీడల్లో రాణించాలనే ఆకాంక్షతో క్రీడలను పోలీసు శాఖ ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

నోటీసు ఇస్తున్న ఒప్పంద ఉద్యోగులు

20 నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మండలంలో పని చేస్తున్న సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు డిసెంబర్ 20 నుంచి సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు నర్సీపట్నం మండల విద్యాశాఖ అధికారి సిహెచ్. తలుపులకు శనివారం నోటీసు అందజేశారు. సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే 15 డిమాండ్లతో సమ్మె చేపడుతున్నట్లు ఒప్పంద ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు వరహాల నాయుడు, ఉపాధ్యక్షుడు భవాని, జనరల్ సెక్రెటరీ ఎన్.రమేష్, పూడి వెంకట్రావు, పి.సతీష్, కుచెల్ కుమార్, మాధవి, శ్రీనివాసరావు, రామలక్ష్మి, సర్వలక్ష్మి, వెంకట లక్ష్మీ, రమణమ్మ, దేముళ్ల నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

నర్సీపట్నంలో భారత రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం డిపార్టుమెంట్స్ ఆఫ్ ఆర్ట్స్ సంయుక్తంగా భారత రాజ్యాంగ దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎన్ ఎస్.కృష్ణ మాట్లాడుతూ, దేశానికి రాజ్యాంగం అవశ్యతను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన డిజిటల్ క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.సురేష్‌బాబు, ఎం.కొండలరావు, జి.చెంచుబాబు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణను విరమించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్: ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఇప్పటిలో కాదని బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు అదే పనిగా చెప్పడం సరికాదని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను రద్దు చేసినట్లు కేంద్రం ప్రకటించాలని ఐఎన్ టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం డిమాండ్ చేశారు.స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 966 వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి గనులను ప్రైవేటీకరణ చేయడం లేదని కేంద్రం ప్రకటించిందని, అదేవిధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని ప్రకటించాలన్నారు. సుమారు వెయ్యి రోజులుగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా పోరాటం సాగుతుంటే, పోరాటాన్ని తప్పుదోవ పట్టే విధంగా బిజెపి ఎంపీ జివిఎల్ ప్రకటనలు చేయడం సరికాదన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ చేయడం లేదని ప్రకటించే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ దీక్షల్లో ఐఎన్ టియుసి జిల్లా కార్యదర్శి వై.నర్సింగరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.తాతబాబు, కె.రవి, పి.మధు, ఎం.హరి, ఎస్.సూరప్పడు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ..

పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నక్కపల్లి: పంచాయతీ రాజ్ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పూర్తిగా నిర్వీర్యం చేశారని మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. నక్కపల్లిలో శనివారం జరిగిన మాజీ ఎమ్మెల్యే అనిత గృహ ప్రవేశానికి అయ్యన్న హాజరై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూర్వం గ్రామాలు అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిందన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం బాగుంటుందన్న సంకల్పంతో ఆనాడు పంచాయతీ రాజ్ వ్యవస్థకు ప్రత్యేక చట్టం తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం అందించే నిధులు, పన్నుల ద్వారా సర్పంచ్‌లు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేవారన్నారు. నేటి రాజకీయ నేతలకు గ్రామీణ పంచాయతీ రాజ్ వ్యవస్థపై అవగాహన లేకపోవడం దారుణమన్నారు. సర్పంచ్‌లు, ఎంపిటీసీ సభ్యులను పక్కనపెట్టి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవగాహన లేని వాలంటీర్ వ్యవస్థను తీసుకు వచ్చారని విమర్శించారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు నాయుడును అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టారని, కనీసం రూ.53ల అవినీతి చూపించలేక పోయారన్నారు. కొత్తగా రింగ్ రోడ్డు కేసు పెట్టారని, అసలు రోడ్డే వేయలేదని కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. ఐఎఎస్, ఐపీఎస్ అధికారులు జగన్‌కు తొత్తులుగా వ్యవహరి స్తున్నారని విమర్శించారు. విశాఖకు రక్షణ కవచం ఋషికొండ అని అన్నారు. తుఫాన్లు అడ్డుకునేందుకు ఋషి కొండ రక్షణ కవచంలా కాపాడుతుందన్నారు. అటువంటి కొండను నాశనం చేసి రూ.430 కోట్లతో సీఎంకు బిల్డింగ్ నిర్మించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిం చారు. ఎవరు సొమ్ముతో బిల్డింగ్ నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేశారన్నారు. 11 లక్షల కోట్లు అప్పు తెచ్చారని, జగన్ పోతే ఎవరు తీరుస్తారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను కూడా, ఆయన చేసిన అభివృద్ధిగా చెప్పుకుంటున్నారని విమర్శించారు. జగనే ఎందుకు కావాలని కార్యక్రమం పై విమర్శించారు. రాజధాని నిర్మించారా? ప్రత్యేక హెూదా సాధించారా? విశాఖకు మెట్రో ట్రైన్ తీసుకువచ్చారా.. ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు.సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి ఉపాధ్యాయులను మోసం చేశారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, మాడుగుల ఇన్చార్జి కుమార్, నక్కపల్లి పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

ఉత్తరాంధ్రపై ఏనాడైనా జగన్ సమీక్ష చేశారా ?

టిడిపి జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్

ప్రజాశక్తి - కలెక్టరేట్: ఉత్తరాంధ్రపై ఏ రోజైనా ముఖ్యమంత్రి జగన్ సమీక్ష చేశారా అని టిడిపి జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రశ్నించారు. శనివారం ఉదయం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏ రోజూ సచివాలయం ముఖం చూడని ముఖ్యమంత్రి విశాఖలో కూర్చుని ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సమీక్ష చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. మొన్ననే ప్రజలు నిలదీయడంతో బైక్ పై ఎమ్మెల్యే దౌడు తీశారని, ఇలాంటి ఘటనలతో వైసిపి ప్రభుత్వం తీరుని చెప్పవచ్చు అన్నారు. రాజాంలో రోడ్లు గుంతలు పడ్డాయని, విశాఖ సమస్యలపై, స్టీల్ ప్లాంట్ మీద సమీక్ష జరిపారా అని ప్రశ్నించారు. ఏ రోజూ స్టీల్ ప్లాంట్‌పై మాట్లాడని సిఎం ఇక్కడ మంత్రులు, వారి అనుచరులు దోచుకున్న అంశాలపై సమీక్ష జరపడానికి వస్తున్నారా అని ఎద్దేవా చేశారు. వంశధార, గొట్టా బ్యారేజి మీద కనీసం చెల్లింపు లేదని, ఈ వెనుకబడిన ప్రాంతాలపై ఏ సమీక్షా జరపలేదని తెలిపారు. ఉత్తరాంధ్ర లో వైసిపికి ఒక్క సీటు కూడా రాదని, సిఎం జగన్ నిలబడినా కూడా సీటు రాదని ఆయన జోష్యం చెప్పారు. ఉత్తరాంధ్రకు జగన్మోహన్ రెడ్డి చేసిన ద్రోహం ఎవ్వరూ మర్చిపోరన్నారు.ముందు సిఎం కార్యాలయం కాదని చెప్పి నేడు, దీని ముసుగు తీసి సిఎం కార్యాలయం అని చెప్తున్నారన్నారు. మినిస్టర్ ఆఫ్ ఎన్విరాన్ మెంట్ నుంచి టూరిజం కోసం క్లియరెన్స్ తెచ్చి, ఇప్పుడు సిఎం ఆఫీస్ అంటున్నారని విమర్శించారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: జాతీయ పర్యాటక పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి జి.దాసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత పర్యాటక మంత్రిత్వ శాఖ గ్రామీణ పర్యాటకం, గ్రామీణ ప్రాంతాలలో ఒక విభాగం నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని ఆయన చెప్పారు.సంబంధిత రంగాల్లో అనుభవం, ఆసక్తిగల సంస్థలు పూర్తి వివరాలకు వెబ్ సైట్ ను పరిశీలించాలని తెలిపారు. ఉత్తమ గ్రామీణ హెూమ్ పోటీలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఆన్లైన్లో పూరించి సమర్పించిన దరఖాస్తులు మాత్రమే మూల్యాంకనం కోసం పరిగణించబడతాయని తెలిపారు.

ఘనంగా ఎన్‌సిసి ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి -పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో ఎన్.సి.సి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ తహసిల్దార్ కె.నూకరాజు ఎన్.సి.సి విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్.సి.సి విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు.నిరంతర సాధనే ఉన్నత శిఖరాలకు తీసుకెళుతుందన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొనేందుకు ఎన్.సి.సి ఒక సరైన మార్గమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పిరమిడ్ ఆకృతిలో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.వివిధ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టు కొన్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల, స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్.సి.సి. క్యాడెట్స్, ఏ.ఎన్.ఓ లు పాల్గొన్నారు.

విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

వైభవ్ 'విశేష' జ్యూయలరీ ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైభవ్ 'విశేష' జ్యూయలరీ కలెక్షన్ ప్రదర్శన ది గేట్ వే (తాజ్)లో శనివారం ప్రారంభమైంది. ఇది ఆదివారమూ కొనసాగనుంది. 'విశేష' ప్రివ్యూ అండ్ సేల్ జ్యూయలరీ పేరిట సాగిన ఈ ప్రదర్శన అమ్మకాన్ని పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్, న్యూట్రిషియనిష్ట్ డాక్టర్ శారద ప్రారంభించారు. ఇన్స్పైర్డ్, హ్యాండ్ క్రాఫ్ట్, క్యూరేటెడ్ గోల్డ్, డైమండ్, ఏంటిక్, ఫ్యూజన్, ఫైన్ జ్యూయలరీ డిజైనులతో పాటు కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా ఆరు సరికొత్త కలెక్షన్లను, జాముద్, అరేలియా, ప్రిస్మాటికా, అవతార, బ్లూమ్ ఫైన్ అండ్ ఇవాల్వ్, డిజైనర్ డైమండ్ జ్యూయలరీని ఈ వివాహ, పండుగ సమయాలను పురస్కరించుకుని అందుబాటులో ఉంచారు. ఈ ప్రదర్శనలో లైట్ వెయిట్, ఫ్లోరల్, 3డి, నేచురల్ మ్యాన్మేడ్ అండ్ నిజామ్స్ నాటి ఆభరణాల ప్రేరణతో తయారు చేయబడిన ప్రత్యేక ఎమరాల్డ్ కలెక్షన్స్ కస్టమర్లను ఎంతగానో ఆకర్షించాయి. ఈ ప్రత్యేక కలెక్షన్స్ లక్ష రూపాయల నుంచి ప్రారంభవుతాయని నిర్వాహకులు తెలియజేశారు. ఈ ప్రదర్శన ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ కొనసాగుతుందని చెప్పారు. ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని వైభవ్ సంస్థ ఛైర్‌పర్సన్ గ్రంధి మల్లికా మనోజ్ కోరారు.

వైభవ్ విశేష జ్యూయలరీ ప్రదర్శనను ప్రారంభిస్తున్న అతిథులు, చిత్రంలో గ్రంధి మల్లికా మనోజ్